క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బొక్కలగడ్డ, శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ, యాదవనగర్, ఏజీఆర్ గార్డెన్, మోరీ, కుమార్‌పల్లి మార్కెట్, వినాయక నగర్ కాలనీ, రెడ్డి కాలనీ, మారుతీనగర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, రాగన్న దర్వాజ, రాయపుర, ఏనుగుల గడ్డ, బ్రాహ్మణవాడ, వడ్డెపల్లి, టీచర్స్ కాలనీ-2, విజయ్‌పాల కాలనీ, జీఎంఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శత ఘటాభిషేకం



కాశిబుగ్గ : కాశిబుగ్గలోని పురాతన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో కొలువై ఉన్న దక్షిణముఖ ఆంజనేయస్వామికి మంగళవారం శత ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య భక్తులు 108 కలశాలతో ద్రవ్యాలు తీసుకవచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, సుల్తానా సమ్మక్క, సమ్మయ్య, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, మంచాల సృజన, రాగుల ప్రసాద్, కూరపాటి రవికుమార్, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన వాసుదేవరెడ్డి



హన్మకొండ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును ఆ పార్టీ అధికార ప్రతినిధి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్‌రెడ్డికి పూర్తి సహకారం అందించాలని, సమష్టిగా పని చేయాలని వాసుదేవరెడ్డికి సూచించారు. భవిష్యత్తులో పార్టీలో సముచితమైన స్థానం కల్పిస్తామని, మంచి భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు.

చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన రమేశ్ అక్రమాలకు పాల్పడినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కేయూలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దల సభకు మేధావిని పంపండి

హన్మకొండ: పెద్దల సభకు మేధావి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పంపాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు పాలమాకుల కొమురయ్య, దామోదర్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎల్ఐసీ కేంద్ర కార్యాలయం, ఎల్.బి.కళాశాల, కాళోజి హెల్త్ యూనివర్సిటీలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్వీ నాయకులు జెట్టి రాజేందర్, రాజేష్ నాయక్, విజయ్‌కుమార్, సిద్ధు, రాజశేఖర్, అర్జున్ పాల్గొన్నారు.

కేయూలో పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం అధ్యాపకులు తమను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం వద్ద ధర్నా చేపట్టారు. పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు మాట్లాడుతూ పార్ట్‌టైం అధ్యాపకులుగా గత 13 నుంచి 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వీసీ మూడేళ్ల పదవికాలంలో చేయలేదని తమను మోసం చేశారని ఆరోపిస్తూ వీసీ పదవికాలం ముగిశాక కొబ్బరికాయలు కొట్టి నిరసన తెలిపారు. సుమారు 50వరకు కొబ్బరికాయలు కొట్టినట్లు తెలిపారు. డాక్టర్ కృష్ణ సుమంత్, దేవో జీనాయక్, నరేందర్, కల్యాణిప్రియా, సంధ్య, సుధీర్, జాస్మిన్, శ్యాంసుందర్‌చారి, సృజన, విజయ్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

తవ్విన మొరం ఏమైంది?

- అనుమతి ముగిసినా..ఆగని దందా
- మొరం అమ్ముకున్న అధికార పార్టీ నేతలు!



మొరం తవ్విన దేవన్నపేట గుట్ట

హసన్‌పర్తి : దేవన్నపేటలో గిరిజన సంక్షేమ హాస్టల్ భవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం సర్వే నంబర్ 217లో ఐదెకాల స్థలాన్ని అధికారులు కేటాయించారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరో రూ.5 కోట్లు విడుదల కాగా, కేటాయించిన స్థలంలో గుట్ట ఉండడంతో అందులోనే నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. అధికారులు గుట్టను చదును చేసి భవనం నిర్మించేందుకు మైనింగ్ శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. గుట్ట నుంచి తవ్విన మొరాన్ని మళ్లీ భవన నిర్మాణంలో వినియోగించాలనే ఆదేశాలున్నాయి. దీంతో మార్చి 31వ తేదీ వరకే గుట్ట చదును చేసేందుకు అనుమతి ఇచ్చారు. కానీ గుట్ట నుంచి తవ్విన మొరం జాడలేదు. గుట్ట నుంచి తవ్విన కోట్లాది రూపాయల విలువ గల మొరం ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా, గడువు ముగిసిన కూడా రాత్రింబవళ్లు యథేచ్ఛగా గుట్ట నుంచి అక్రమంగా మొరం వ్యాపారానికి తెర లేపారు.

మొరం అమ్ముకున్న అధికార పార్టీ నేతలు?

గడువు ముగిసిన తర్వాత కొంతమంది అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్‌తో కలిసి మొరం దందాకు పాల్పడినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇందుకు ఓ ప్రజాప్రతినిధి దగ్గరి బంధువు ఆయా శాఖల అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో కొందరు షాడో ఎమ్మెల్యేగా చెలామణి అవుతున్నట్లు చర్చ జరుగుతోంది. తనకు చెబితే ఎమ్మెల్యేకు చెప్పినట్లేనని వారు షాడో ఎమ్మెల్యే అవతారమెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు.

రెవెన్యూదే బాధ్యత

మార్చి 31 వరకు మాత్రమే గుట్ట చదును చేసేందుకు మేం అనుమతి ఇచ్చాం. అనంతరం మొ రం అక్రమంగా తరలి వెళ్లకుండా చూసుకునే బాధ్యత రెవెన్యూ శాఖదే. అయితే మొరం మాయమైనట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ చేసేందుకు తహసీల్దార్ లిఖితపూర్వకంగా తమకు లెటర్ ఇవ్వాలి.

– సాంబశివరావు, మైనింగ్ ఏడీ

తీన్మార్ మల్లన్న.. బ్లాక్ మెయిలర్

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



హసన్‌పర్తి : మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

హసన్‌పర్తి: ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న ఓ బ్లాక్ మెయిలర్ అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని బాలాజీ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న ఓ టీవీ చానల్‌లో పనిచేసి ఆ సంస్థనే మోసం చేశాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఎప్పుడైనా ఆ పార్టీ నుంచి వ్యతిరేకంగా మాట్లాడారని అని ప్రశ్నించారు. బ్లాక్ మెయిలింగ్ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు ఓటు వేస్తారా? విద్యావంతుడైన రాకేష్‌రెడ్డికి ఓటు వేస్తారో ఆలోచించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బండి రజనీకుమార్, నరెడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మాజీ సర్పంచ్ రఘు, రైతుబంధు సమితి జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, డివిజన్ యూత్ అధ్యక్షుడు సాయి, ఇ మ్మడి రాజేందర్, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : బ్రోకర్, చిల్లరగాడు, బ్లాక్‌మెయిలర్ తీన్మార్ మల్లన్న లాంటి వారు పెద్దల సభకు పోతే అంబేడ్కర్, నెహ్రూలాంటి పెద్దల ఆత్మ క్షోభిస్తుందని ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. మంగళవారం శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ పట్టభద్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా బాల్క సుమన్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హాజరై మాట్లాడారు. బుధవారం కేటీఆర్ నగర పర్యటనకు వస్తున్నారని నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను సమీకరించి సమావేశం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ హరిరమాదేవి, మసూద్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వలీఉల్లాఖాద్రి

కేయూ క్యాంపస్ : ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రి కోరారు. మంగళవారం తీన్మార్ మల్లన్నకు మద్దతుగా కేయూ వివిధ విద్యార్థి యువజన సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయని ఆయన తెలిపారు. కేయూ మొదటి గేట్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వలీఉల్లాఖాద్రి మాట్లాడుతూ విద్యావంతులు, నిరుద్యోగులు ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు తీన్మార్‌మల్లన్న గొంతుక అవుతారని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సీనియర్ విద్యార్థి నాయకులు ప్రేమ్, కేయూ జాక్ నాయకులు దుర్గం సారయ్య, కన్నం సునీల్, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్తీక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, వివిధ సంఘాల బాధ్యులు సునీత, రాజేశ్వరి, మనిలాగని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గెత్సెమనే సీబీసీ క్యాంప్



క్యాంప్‌లో పాల్గొన్న పిల్లలతో పాస్టర్ రవిపాల్

కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్‌లోని గెత్సెమనే చర్చిలో మంగళవారం చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్ (సీబీసీ) క్యాంప్ ముగిసింది. సీబీసీ కమిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ సిహెచ్.సత్యం ఆధ్వర్యంలో చర్చిలో 7 రోజుల సీబీసీ మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్ పాల్గొని మాట్లాడుతూ దేవుని భయభక్తుల మధ్య పిల్లలు సీబీసీని సద్వినియోగం చేసుకొని ఎన్నో విలువైన విషయాలు నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేవుడు పిల్లలను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని అన్నారు. డాక్టర్ సత్యం మాట్లాడుతూ వేసవి సెలవులను పిల్లలు వృథా చేయకుండా సీబీసీకి వచ్చి దేవుని యందు సమాజంలో చెడుమార్గం అనుసరించకుండా సన్మార్గంలో నడిచేందుకు సీబీసీ ఎంతో దోహదపడుతుందని అన్నారు. చర్చిలో నిర్వహించిన పప్పెట్ షో చిన్నారులను అలరించింది. ఏడు రోజుల్లో 60 మంది పిల్ల లకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు, యూ త్ వారు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిలావరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 12 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనిపెట్టి మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందాల్సిన పనిలేదని, వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వివరాలతో కూడిన సమాచారం అందజేస్తే సీఈఐఆర్ ద్వారా ఆచూకీ కనిపెట్టి సెల్‌ఫోనును అప్పగిస్తామని తెలిపారు. ఎస్సై గోవర్ధన్, పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

- మూడు బ్యాటరీలు, ఆటో, 13 బెంచీలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గోవర్ధన్‌తో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 17న మధ్యాహ్నం స్కూల్‌కు తాళం వేసి ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించి మూడు బ్యాటరీలు, 13 బెంచీలను ఓ ఆటోలో వేసుకొని వెళ్లారు. అదే రోజు సాయంత్రం స్థానికులు గమనించి హెచ్ఎం రేవూరి మాధవికి సమాచారం అందజేశారు. 18న ఉదయం హెచ్ఎం పాఠశాల చేరుకుని తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించగా మూడు బ్యాటరీలు, 13 బెంచీలను ఎత్తుకెళ్లారు. అదేరోజు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 20న సోమవారం కరీమాబాద్ ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై గోవర్ధన్ వాహన తనిఖీలు చేపట్టారు. ముందుగానే పోలీసులను గమనించిన దొంగలు ఆటో దిగి పోరిపోతుండగా కరీమాబాద్ బీరన్నకుంటకు చెందిన పిడికల శివకుమార్(21), రాంపాక కిరణ్, పసునూరి సాయికుమార్(23)లను వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా ఆటో, 13 బెంచీలు, మూడు బ్యాటరీలు వారి నుంచి స్వాధీనపర్చుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

రైల్వే సీసీఎస్ రుణానికి లంచం

- వాట్సాప్ గ్రూప్‌లో ప్రత్యక్షం
- అవాస్తవమంటున్న కాజీపేట సీసీఎస్ పాలకవర్గం
- వాస్తవమే అంటున్న రైల్వే సంఘ్ నాయకులు

కాజీపేట రూరల్: సీసీఎస్ మజ్దూర్ యాజమాన్యం రూ.30 వేలు లంచం తీసుకొని కాజీపేటలో ఓ రైల్వే ఎస్ఎస్ఈకి మ్యారేజ్ లోన్ మంజూరు చేసినట్లు మంగళవారం సోషల్‌మీడియాలో వచ్చిన అంశం కార్మికుల్లో కలకలం రేపింది. వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన మ్యారేజ్ లోను విషయం నిజం కాదని, కాజీపేటలో రైల్వే ఎస్ఎస్ఈకి ఎలాంటి మ్యారేజ్ లోన్ ఇవ్వలేదని, కావాలని కొందరు ఆరోపణలు చేస్తున్నారని మజ్దూర్ యూనియన్ ప్యానెల్ కాజీపేట రైల్వే సీసీఎస్ పాలకవర్గం సభ్యులు విలేకర్లకు తెలిపారు. ఈ విషయంపై కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సీసీఎస్ కమిటీ వారే చేశారు..

వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన రైల్వే ఎస్ఎస్ఈ మ్యారేజ్ లోన్ విషయం నిజమేనని కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు అంటున్నారు. సీసీ ఎస్‌లో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు సంఘ్ నాయకులపై పోలీస్ కేసు పెట్టారని, వారి అవి నీతికి సాక్ష్యాధారాలను పోలీస్‌స్టేషన్‌లో సమర్పించినట్లు వారు తెలిపారు. ఇరు యూనియన్ల ఆరోపణలు, ప్రత్యారోపణలపై రైల్వే పోలీస్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

సంక్షిప్త వార్తలు

గోవులను తరలించే వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: గోవులను వధించి మాంసం విక్రయించే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ.యాకూబ్ గోవులను వధించి మాంసం విక్రయిస్తు జీవనం సాగిస్తున్నాడు. వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో కొనుగోలు చేసిన 21 గోవులు సోమవారం సాయంత్రం వరంగల్ చింతల్‌కు చేరుకున్నాయి. పక్కా సమాచారం మేరకు ప్రత్యేక వాహనంలో చేరిన గోవులను పోలీసులు పట్టుకుని గోవుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. కేసును సుమోటోగా స్వీకరించి గోవులను చంపి మాంసం విక్రయిస్తున్న యాకూబ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటకు చెందిన ఓ యువతి మంగళవారం అదృశ్యమైంది. వరంగల్ కొత్తవాడలోని భారతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పరీక్షలు రాసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన జయభా(21) సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. యువతి తల్లి సుల్తాన్ ఫరోజ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్చక సంఘం కమిటీ

హసన్‌పర్తి: తెలంగాణ ధూప దీప నైవేద్య సంఘం హసన్‌పర్తి శాఖ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేదాంతం సంపత్‌చార్యులు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల ప్రణీత్ శర్మ ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కమి టీ కొనసాగుతోందని జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతి గణేష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రిస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల మధుకర్‌శర్మలు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

హసన్‌పర్తి : ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచన దళితవర్గానికి చెందిన విద్యార్థులను అభినందించారు. మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. దళిత సంఘం నాయకుడు మేకల యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

సైన్స్‌ను అభివృద్ధి చేసిన రాజీవ్‌గాంధీ



హన్మకొండ చౌరస్తా : రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రియాజ్, రామకృష్ణ



వరంగల్ అర్బన్ : గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో పూలమాల వేస్తున్న కొమ్ము శ్రీధర్



హన్మకొండ: రాజీవ్ గాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ చౌరస్తా: దేశంలో సైన్స్, టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీదే అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ. రియాజ్ మాట్లాడుతూ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల వయస్సులో ప్రధాని బాధ్యతలు చేపట్టి భారత అభ్యున్నతికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఎన్ఎస్‌యూఐ, యువజన, మహిళా కాంగ్రెస్, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

వరంగల్ అర్బన్ : 27వ డివిజన్ ఎల్‌వీఆర్ కాలనీలో మంగళవారం స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దౌడు నాగరాజు నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద పాల్గొన్నారు. గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో ఎస్సీసెల్ నగర మాజీ అధ్యక్షుడు కొమ్ము శ్రీధర్ ఆధ్వర్యంలో సదానందం, విశాల్, రమేష్, అమర్, గోపి, శరత్, అక్షయ్, నర్సింగరావు పాల్గొన్నారు.


ఢిల్లీ రాజ్‌ఘాట్‌లో రాజీవ్‌గాంధీకి నివాళి

హన్మకొండ: ఢిల్లీలోని వీరభూమిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వినోద్ లోక్‌నాయక్, భూక్యా రమేశ్, మాలోతు వెంకన్న, సునీల్‌నాయక్, రవి రాథోడ్, నాగరాజు వీరభూమిలోని సమాధి వద్ద నివాళులర్పించారు.


హసన్‌పర్తి : మండలంలోని సీతంపేటలో మంగళవారం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ, మాజీ సర్పంచ్ చేరాలు, కాంగ్రెస్ నాయకులు కిషన్‌రెడ్డి, యుగంధర్, శ్రీనివాస్, రమేష్, రాజయ్య, రోహిత్, రవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. భీమారంలోని 55వ డివిజన్‌లో నాయకులు సారంగపాణి, కుమార్, గోవర్ధన్, సంగాల ప్రేమ్, రాజు పాల్గొన్నారు.

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, ప్రభాకర్, నరేష్, కృష్ణరెడ్డి, రమేష్, ఎండీ బషీర్, వేణు, రఘుందర్ పాల్గొన్నారు.


కాశిబుగ్గ : దేశానికి సాంకేతికతను తీసుకొచ్చింది స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీనేనని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నల్గొండ రమేశ్ అన్నారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 19వ డివిజన్ అధ్యక్షులు రాజేశ్, రవీందర్, సాయికుమార్, ప్రభాకర్, సాంబరాజు, శ్రీనివాస్, శశి, హరిప్రసాద్ పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో..



మడికొండలో..



కాశిబుగ్గలో..

చేయూత


హసన్‌పర్తి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీతంపేటకు చెందిన జంపాల మురళి కుటుంబానికి మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ చేరాలు, కిషన్‌రెడ్డి,రోహిత్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల గుండెపోటుకు గురై మరణించిన పలివేల్పులకు చెందిన చెల్పూరి పాపక్క కుటుంబానికి శ్రీసాయి స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. మంగళవారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి, బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



హసన్‌పర్తి: చెరువు కబ్జాపై అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. మండలంలోని భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురవుతూ వస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో అక్రమార్కులు మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు వాటిని అడ్డుకోవడమే కాకుండా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల క్రితం నీటిపారుదలశాఖ అధికారులు.. కార్పొరేషన్‌తోపాటు, రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. దీంతో కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగి జేసీబీ ద్వారా నిర్మాణాలు కూల్చివేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీనివాస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, చూర్‌మెన్ ఓదెలు, స్థానికులు రమేష్, పప్పుల రమేష్, ఆకుల కుమార్, వల్లాల శ్రీధర్ పాల్గొన్నారు. సర్కార్ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత హెచ్చరించారు. భీమారంలోని కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వస్తున్న చెరువులు, ఎస్సారెస్పీ భూముల సర్వే నిర్వహించి హద్దులు పాతాలని అధికారులకు వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు.

కేయూ వీసీ దిష్టిబొమ్మతో శవయాత్ర



కేయూ క్యాంపస్ : కేయూ వీసీ తాటికొండ రమేశ్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల బాధ్యులు మంగళవారం నిరసన తెలిపారు. క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నుంచి వీసీ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిచారు. ర్యాలీగా బయటికి వచ్చి దిష్టిబొమ్మను దహనం చేశారు. వీసీకి వ్యతిరేకంగా నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అప్పట్లో ఆందోళన చేసిన కొంతమంది విద్యార్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించారని విమర్శించారు. మూడేళ్లపాలనలో విద్యార్థుల సొమ్మును దుర్వినియోగం చేసిన వీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనకు తొత్తుగా వ్యవహరించిన ఓ ఉద్యోగి, ముగ్గురు ప్రొఫెసర్లను తొలగించాలని కోరారు. మహ్మద్‌పాషా, రాంబాబు, శంకర్, రాజేశ్, మధుపాల్గొన్నారు.